అమరం.. స్మరణం

- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అమూల్యం
- పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నేడు


అమరవీరుల స్తూపం

నెల్లూరు(క్రైమ్): సరిహద్దుల్లో శత్రు మూకలను తరమికొట్టే వీరుడు సైనికుడైతే.. సమాజంలో అంతర్గతంగా శాంతిభద్రతలను పరిరక్షించి ప్రజా శ్రేయస్సుకు పాటుపడే ధీరుడు, ప్రజా హితుడు పోలీస్. శత్రుసేనలతో నిరంతరం సమరం సాగించేది సైనికుడైతే.. సమాజంలో సంఘ వ్యతిరేక శక్తులను అదుపు చేసేందుకు నిరిర్విరామంగా శ్రమించేది పోలీసే. ఉగ్రవాదులు, తీవ్రవాదులు, అసాంఘిక శక్తులకు దీటైన సమాధానమివ్వడమే కాకుండా.. వేదనతో ఉద్రిక్తమయ్యే ప్రజల విషయంలో సంయమనం చూపాల్సిన గురుతర బాధ్యత పోలీసులపైనే ఉంది. శాంతిభద్రతల పరిరక్షణలో తమ ప్రాణాలను బలిదానం చేసిన చరితార్థులెందరో. వీరందరికీ యావత్ భారతావని సెల్యూట్ చేస్తోంది.

సంస్మరణ దినం ప్రారంభమైంది ఇలా..

అక్టోబర్ 21, 1959న జమ్మూకశ్మీర్‌లోని హిమాలయ పర్వత శ్రేణుల్లో దేశ సరిహద్దు లద్దాఖ్‌లోని హాట్‌స్ప్రింగ్స్ ప్రాంతంలో దేశంపై చైనా దురాక్రమణకు పాల్పడింది. రక్తం గడ్డకట్టే చలిలో దేశ రక్షణ కోసం విధుల్లో ఉన్న సైనికులు వీరోచితంగా పోరాడి చొరబాటుదారుల దాడులను సమర్థంగా తిప్పికొట్టారు. ఈ భీకర పోరులో పది మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది అసువులు బాశారు. వీరి త్యాగాలను స్మరించుకుంటూ మరుసటి ఏడాది నుంచి ఏటా అక్టోబర్ 21న అమరువీరుల సంస్మరణ దినాన్ని జరుపుకొంటున్నారు. వారం పాటు కార్యక్రమాలను నిర్వహించి అమరులకు నివాళులర్పిస్తున్నారు.

ఏడాదిలో 12 మంది మృతి

ఏడాది కాలంలో జిల్లాలో 12 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది మృతి చెందారు. సీఐ రామారావు, ఏఎస్సైలు సుబ్రహ్మణ్యం, రఫీ హకీమ్, హెడ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, ధనుంజయ, సివిల్ కానిస్టేబుల్ కృష్ణ, రమేష్, ఏఆర్ కానిస్టేబుళ్లు రమేష్, వెంకటసుధీర్, హరికృష్ణ, శివకుమార్, కోబ్లర్ సుబ్రహ్మణ్యం వివిధ కారణాలతో మృతి చెందారు.

నగరంలో కార్యక్రమాలు నేడు

పోలీస్ కవాతు మైదానంలోని అమరవీరుల స్తూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించనున్నారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ తదితరులు నివాళులర్పించనున్నారు. అనంతరం నగరంలో ర్యాలీని జరపనున్నారు.

సజీవ సాక్ష్యాలు..

జిల్లాలో ఎందరో సిబ్బంది విధి నిర్వహణలో చూపిన ధైర్యసాహసాలు కళ్లముందు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

- 1981లో నాటి నెల్లూరు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వారెంట్ ముద్దాయిని అరెస్ట్ చేసేందుకు కానిస్టేబుల్ రామయ్య వెళ్లారు. ఈ సమయంలో కానిస్టేబుల్‌ను సదరు ముద్దాయి కిరాతకంగా హత్య చేశారు.
- 1991లో రాష్ట్ర సరిహద్దులో తమిళనాడుకు అక్రమంగా తరలిపోతున్న ధాన్యం రవాణాపై ఉక్కుపాదం మోపారు. నాటి తడ ఎస్సై నాగేశ్వరరావును స్మగ్లర్లు లారీతో ఢీకొని హతమార్చారు.
- 1997లో కొండవీటి సింహంగా పేరు తెచ్చుకున్న వరికుంటపాడు ఎస్సై వెంకటేశ్వరరావును పోలీస్‌స్టేషన్ సమీపంలోనే విచ్ఛిన్నకర శక్తులు గొడ్డళ్లతో అతి కిరాతకంగా హత్య చేశాయి.
- 1994లో వరంగల్ జిల్లా ఉరవకొండలో ఎన్నికల బందోబస్తు విధులకు వెళ్తున్న వెంకటగిరి బెటాలియన్ సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాన్ని నక్సలైట్లు మందుపాతరలతో పేల్చేశారు. ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందగా, మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు.
- 2006లో నల్లగొండ జిల్లా చింతపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఆర్ పోలీసులు రామచంద్రయ్య, అరుణకుమార్, షరీఫ్, శ్రీనివాసులు, యుగంధర్ మరణించారు.
- 2007, అక్టోబర్ 30న రాపూరు ఘాట్ రోడ్డు వద్ద అవతలివైపున కడప జిల్లా పరిధిలో గల అనుపల్లి వాగు ఉధృతంగా ప్రవహించింది. ప్రవాహంలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులను రక్షించే క్రమంలో రాపూరులో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న మల్లికార్జున, అల్లాబక్షు ప్రాణాలు కోల్పోయారు.
- 2008లో ఆంధ్రా – ఒడిశా సరిహద్దు ప్రాంతమైన బలిమెల రిజర్వాయర్ వద్ద నిరాయుధులైన గ్రేహౌండ్స్ సిబ్బందిపై మావోయిస్టులు జరిపిన దాడుల్లో 36 మంది మృతి చెందారు. ఇందులో జిల్లాలోని కలువాయికి చెందిన అనకర్ల కేశవులు (ఏపీఎస్పీ కానిస్టేబుల్) వీరమరణం పొందారు.

క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

నెల్లూరు(బారకాసు): నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని కోరారు.

వైభవంగా గ్రామోత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


పురవీధుల్లో ఊరేగుతున్న దుర్గామాత

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో దసరా ముగింపు ఉత్సవాలను శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయంలో అర్చకుడు శ్రీనివాసులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం దుర్గాదేవి రూపంలో అలంకరించిన అమ్మవారిని ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. విద్యుద్దీపాల వెలుగుల మధ్య ఉత్సవాల వెంట ఏర్పాటు చేసిన భేతాళ నృత్యం, కోలాటం, తప్పెట్లు, మంగళవాయిద్యాలు, వివిధ వేషధారణలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. అడుగడుగునా గ్రామస్తులు అమ్మవారికి కొబ్బరికాయలు, పూలు, పండ్లను నైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు పట్టారు. యువకులు బాణసంచా పేలుస్తూ ఉత్సవాల వెంట కేరింతలు కొట్టారు. పోలేరమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

బాణసంచా పేలుళ్ల బాధితులకు పరామర్శ



మనుబోలు : మనుబోలు బీసీ కాలనీలో ఇటీవల వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా జరిగిన బాణసంచా పేలుళ్లలో బాధితులను నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. ఈ పేలుళ్లలో మంగమ్మ అనే ఒంటరి మహిళకు చెందిన రేకుల ఇల్లు పూర్తిగా దిబ్బతిని ఆమె వీధిన పడింది. ఈ విషయం తెలుసుకుని స్పందించిన ఎస్సై శివరాకేష్ ఆమెకు తన సొంత నిధులతో తిరిగి రేకుల ఇల్లును నిర్మించి ఇచ్చారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసరావు ఎస్సై రాకేష్‌ను అభినందించారు. దీనిని స్ఫూర్తిగా తీసుకుని దాతలు బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట సీఐ రాంబాబు, ఏఎస్సై జిలానిబాషా, రవిచంద్ర, కానిస్టేబుళ్లు మాధవరావు, ముఖేష్ తదితరులు ఉన్నారు.

భగవద్గీత పఠనం.. సత్ప్రవర్తనకు మార్గం

తోటపల్లిగూడూరు : భగవద్గీత పఠనం.. సత్ప్రవర్తనకు మార్గం అని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సూరమౌళి పేర్కొన్నారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ వారు మండలంలోని నరుకూరు, ఆంజనేయపురం, చింతోపు, ముంగళదొరువు, సౌత్‌ఆములూరు గ్రామాల్లో భగవద్గీతతో పాటు వంద అనుబంధ గ్రంథాల పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా సూరమౌళి మాట్లాడుతూ ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానుడు యుద్ధరంగంలో మొట్టమొదటి రోజున అర్జునునికి భగవద్గీత జ్ఞానం తెలియపర్చారన్నారు. గీతలో ఉన్న ధర్మాలను ప్రతిఒక్కరూ ఆచరించి శ్రీకృష్ణ పరమాత్మ లోకానికి ఐక్యం కావాలన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూజ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యులు ప్రదీప్, నరసింహప్రసాద్, కల్పన, సుదర్శనమ్మ, రామయ్య, కొండమ్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిబిరం

పొదలకూరు : పట్టణంలోని నిర్మలానంద నిత్య సాధన యోగా కేంద్రంలో ఐదు రోజుల పాటు మధుమేహ వ్యాధిపై ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ముగింపు సమావేశంలో యోగా గురువు రిత్‌దేవ్‌జీ మహరాజ్(హరిద్వార్) ప్రసంగించారు. ఐదురోజుల పాటు షుగర్ వ్యాధి నియంత్రణపై యోగాలో శిక్షణ ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో యోగా సాధన ద్వారా షుగర్‌ను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు వీలు ఉంటుందన్నారు. యోగా గురువు సీహెచ్ పెంచలయ్య, లక్కాకుల ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశం


నూతన కార్యవర్గం

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడిగా సోమవరప్పు భాస్కర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. నగరంలోని సుంకు చెంగన్న మున్సిపల్ పాఠశాలలో ఏపీ ప్రధానోపాధ్యాయ సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా చలపతి, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ఆర్థిక కార్యదర్శిగా చలపతి, నెల్లూరు డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బుజ్జయ్య, వెంకటేశ్వర్లరావు, సాయిప్రసాద్ ఎన్నికయ్యారు. ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్లు నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో జీవించాలని, లేని పక్షంలో పీడీ యాక్ట్‌లను నమోదు చేస్తామని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. నగరంలోని ఆరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గల యాక్టివ్ రౌడీషీటర్లకు కౌన్సెలింగ్‌ను చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం నిర్వహించారు. రౌడీషీట్‌ను ఎప్పుడు.. ఏ కేసుపై తెరిచారు.. ప్రస్తుతం ఏమి చేస్తున్నారు.. ఎక్కడుంటున్నారు.. తదితర వివరాలను ఆరాతీసిన అనంతరం డీఎస్పీ మాట్లాడారు. రౌడీయిజాన్ని చెలాయించినా.. దౌర్జన్యాలు.. పంచాయితీలు చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తీరు మారని వారిపై పీడీ యాక్ట్‌లను నమోదు చేయడంతో పాటు అవసరమైతే నగర బహిష్కరణకు వెనుకాడబోమని చెప్పారు. నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిశోర్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఓస్టియోపొరోసిస్‌ను దూరం చేద్దాం



నెల్లూరు(అర్బన్): తగిన పౌష్టికాహారం, వ్యాయామం చేయడం, జీవనశైలిలో మార్పుల ద్వారా ఓస్టియోపొరోసిస్‌ను దూరం చేయొచ్చని సాధన ఆర్థోపెడిక్ డాక్టర్ పోలుబోయిన అశ్విన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ఓస్టియోపొరోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమంచర్లలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి గోల్డెన్ సిటీలో స్థానికులకు అవగాహన సదస్సును పీహెచ్‌పీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 40 ఏళ్లు నిండిన వారు ఎముకల పటుత్వ పరీక్షను ఏడాదికోసారి చేయించుకోవాలని కోరారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, వీరయ్య, రామదాసు, నాగరాజు, మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

15న కార్తీక దీపోత్సవం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలో మహాకార్తీక దీపోత్సవాన్ని నవంబర్ 15న నిర్వహించనున్నామని సింహపురి కార్తీక దీపోత్సవ సమితి అధ్యక్షురాలు డాక్టర్ వెన్నెల పేర్కొన్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని నగరంలోని గణేశ్ ఘాట్ వద్ద నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన విస్తృత స్థాయి సమావేశాన్ని రామ్మూర్తినగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిపారు. ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. నగరంలోని మహిళలందర్నీ ఇంటింటికీ వెళ్లి ఆహ్వానించనున్నామని చెప్పారు. అనంతరం సమితి ఉపాధ్యక్షురాలు కోడూరు జయప్రద మాట్లాడారు. గణపతి, రామలింగ విగ్రహానికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నిర్వాహకులు నాగలక్ష్మి, ఉమాదేవి, గురవమ్మ, జయలక్ష్మి, సురేఖ, ప్రవీణ, ముక్కాల వ్యాసప్రసాద్, నరేంద్ర, శ్రీధర్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో పార్టీ జిల్లా కార్యదర్శి మాబాషా ఆధ్వర్యంలో 52వ డివిజన్ పార్టీ నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలను తెలియజేశారు.

ఘన నివాళి



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి మృతి చెందారు. ఈ క్రమంలో ఆయన భౌతికకాయానికి మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చొరవతో..



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచనల మేరకు నగరంలోని 52వ డివిజన్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని మాబాషా ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్నారు. డివిజన్లోని రంగనాయకులపేటలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గానూ ప్రతి ఇంటికీ తాగునీటిని అందజేస్తున్నారు. చంద్రశేఖర్‌రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలను తెలియజేస్తున్నారు. నేతలు జలీల్, హరూన్, సల్మా తదితరులు పాల్గొన్నారు.

ఆనం విజయకుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు



నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో 29, 30వ డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

ఘనంగా భాషా సాహిత్య సమ్మేళన్



అవార్డులను పొందిన వారితో అతిథులు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ సభను తెలుగు, హిందీ శాఖల సమన్వయంతో ఆదివారం నిర్వహించారు. వార్షిక ప్రత్యేక సంచిక వందేమాతరాన్ని ఆవిష్కరించిన అనంతరం సంస్థ జాతీయ అధ్యక్షుడు వీరేంద్రసింగ్ మాట్లాడారు. భారతీయ భాషల పరిరక్షణ కోసం భోపాల్ కేంద్రంగా పనిచేసే సంస్థ 58 ఏళ్లుగా కృషి చేస్తోందని చెప్పారు. 33వ జాతీయ వార్షిక సదస్సు, పురస్కారాల ప్రదానాన్ని సవ్యాంధ్రాలో తొలిసారిగా నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు మాట్లాడారు. భాషలు అంతరించిపోతున్న తరుణంలో ఇలాంటి సభలను నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వర్సిటీ తరఫున అనువాద రచనలకు ప్రోత్సాహాన్ని అందిస్తామని వివరించారు. అనంతరం ఐదు రాష్ట్రాలకు చెందిన 30 మందికి సమన్వయశ్రీ, సాహిత్యశ్రీ, సంస్కృతి భూషణ్, భారత్ భాషా భూషణ్, సరస్వతీ సమ్మాన్, రాష్ట్ర భాషా గౌరవ్ సమ్మాన్ అవార్డులను వీసీ చేతుల మీదుగా అందజేశారు. ప్రఖ్యాత గాయని చిదంబరి, సంస్థ ఏపీ అధ్యక్షుడు పెరుగు రామకృష్ణ, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ ప్రధాన కార్యదర్శి కృతి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షుడు ఆచార్య సత్యమూర్తి, కార్యదర్శి తంగిరాల చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎలిజెబెత్ జయకుమారి, ఒడియా కవయిత్రి, సుశ్రీ సంగీత మిశ్రా, కర్ణాటక నుంచి ఆంగ్ల కవి లక్ష్మణరావు, శ్రీహరికోట నుంచి హిందీ రచయిత రామలింగేశ్వరరావు, డీకేడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ గిరి తదితరులు పాల్గొన్నారు.

అభినందన

అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్‌లో సంస్కృతి భూషణ్ అవార్డు నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్, కవి సరోజాదేవికి లభించింది. ఈ క్రమంలో మినీబైపాస్‌లోని అకాడమీలో ఆమెను నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సీపీఎం మహాసభలు ప్రారంభం


అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సీపీఎం చేపట్టనున్న ప్రజా పోరాటాలకు పార్టీ మహాసభల్లో శ్రీకారం చుట్టనున్నామని పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. సీపీఎం మహాసభలను నగరంలో ఆదివారం ప్రారంభించారు. పార్టీ అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించిన అనంతరం మూలం రమేష్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. గడిచిన మూడేళ్లలో నిర్వహించిన.. రానున్న మూడేళ్లలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించనున్నామని వివరించారు. పార్టీ జిల్లా మహాసభలను ఇందుకూరుపేటలో డిసెంబర్ 7, 8న నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

అన్నింటా విఫలం

రాష్ట్రంలో ఇసుక దోపిడీతో పేదలకు దక్కడం లేదని, ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీతో మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. ట్రూఅప్ చార్జీల పేరుతో సామాన్య, మధ్య తరగతి ప్రజలపై రూ.20 వేల కోట్ల భారాన్ని మోపేందుకు యత్నించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. నగరంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో చేపట్టాల్సిన పోరాటాలు, ఉద్యమాలపై నివేదికను కత్తి శ్రీనివాసులు ప్రవేశపెట్టారు. నేతలు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, చంద్రారెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాసులు, రమణారెడ్డి, సుబ్బమ్మ, నరసింహ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


సర్టిఫికెట్లను అందుకున్న వారితో నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు, కళా ప్రదర్శనలను ఆదివారం నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు, సర్టిఫికెట్లను అందజేశారు. నెల్లూరు కల్చరల్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకుడు బీరంగుంట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రారంభించారు. శాంతిహోమం, మహాభిషేకం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తిరుమంజనం తదితరాలను విశేషంగా నిర్వహించారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

26 నుంచి సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ కోవూరు నియోజకవర్గ సభ్యత్వ నమోదుపై శిక్షణ కార్యక్రమాన్ని కనుపర్తిపాడులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులున్నా, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

త్వరలోనే హామీల అమలు


మాట్లాడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు(సెంట్రల్): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను త్వరలోనే అమలు చేస్తామని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో చేజర్ల మండల పార్టీ నేతలు, కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరులో టీడీపీ కార్యాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు.